## మూసీ పరీవాహక వాసులు అప్రమత్తంగా ఉండాలి

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హిమాయత్‌సాగర్ గేట్లు మరిన్ని తెరిచే అవకాశం ఉన్నందున మూసీ పరీవాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని మలక్‌పేట సర్కిల్–6 డీసీ అలీ పేర్కొన్నారు. శనివారం ఆయన ఓల్డ్‌మలక్‌పేట మూసీ పరిసర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. వరదల సమస్య ఉంటే వెంటనే హైడ్రా, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

## ముస్లిం రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలి

కాచిగూడ: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరస్పరం విమర్శలు మానుకుని 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలోని బీసీలకు కల్పిస్తామంటున్న 42 శాతం రిజర్వేషన్లలో ముస్లిం మైనార్టీలకు 11శాతం ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాలన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై సీఎం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే రిజర్వేషన్ల సాధనకై బీసీలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తారని హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం రూ.20వేల కోట్లు కేటాయించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తరహాలోనే బీసీలకు కూడా చట్టబద్ధమైన సబ్‌ప్లాన్ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## ప్రతిష్ఠాపన మహోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

కాచిగూడ: లింగంపల్లిలోని మహంకాళి దేవాలయంలో ఈనెల 11 నుంచి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద శనివారం ప్రతిష్ఠాపన మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ఎస్.అరవింద్, ఉపాధ్యక్షుడు యాదప్ప, కోశాధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు



జంధ్యాల పౌర్ణమి వేడుకల్లో పద్మశాలి సంఘం నాయకులు

అంబర్‌పేట: గోల్నాక వీరన్నగుట్ట శివాలయం ప్రాంగణంలో శనివారం అంబర్‌పేట నియోజకవర్గ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పద్మశాలి కులస్తులు జంధ్యాలు మార్చుకుని మార్కెండేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వరకాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలుక శికుమార్, ప్రతినిధులు కె.సత్యానారాయణ, సత్తయ్య, తీగల నరేందర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చర్చి వార్షికోత్సవం





అంబర్‌పేట: అలీకేఫ్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి 33వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సుమారు 4వేల మంది క్రైస్తవులు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ మూర్తి దైవ సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మధుసూదన్‌రావు, సత్యం, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

## సంతోషిమాతకు ఒడిబియ్యం

కవాడిగూడ: సంతోషిమాత పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం కవాడిగూడలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పబ్బ శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, కేశవరాజు, సంజయ్‌సింగ్, శేరుపల్లి గణేష్, శివకుమార్ , అక్షయ్ తదితరులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్షా బంధన్.!

రాఖీ అంటే రక్షణ బంధమని అర్థం. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా రక్షా బంధన్ పండుగను నిర్వహించుకుంటారు. పుట్టిల్లు ఎంత దూరంగా ఉన్నా అన్నదమ్ముళ్లకు రాఖీ కట్టేందుకు ప్రతి ఆడపడుచు వచ్చి తమ అనుబంధాన్ని తెలియపరుస్తారు. ప్రతి ఆడబిడ్డ తన అన్నదమ్ముళ్ల ఆయురారోగ్యాలతో.. అష్టైశ్వర్యాలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కాంక్షిస్తూ రాఖీ కడుతుంది. రక్షా బంధన్ పండుగను రాఖీ పౌర్ణమి లేదా జంధ్య పౌర్ణమి అంటారు. అందుకే ఈరోజు పాత జంధ్యాన్ని వదిలి కొత్త జంధ్యాన్ని ధరిస్తారు. అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజవర్గాల్లో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



లిబర్టీలోని ఆప్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రక్షా బంధన్ వేడుకలు



సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్



భోలక్‌పూర్‌లోని పహాడి మసీదు వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు రాఖీలు కడుతున్న ముస్లిం మహిళలు, బ్రహ్మకుమారీలు





గాంధీనగర్‌లో మైనార్టీ మోర్చా నేత ఎండీ మహమూద్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్ పావని



మాజీ మంత్రి నాయిని కుమారుడు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు రాఖీ కడుతున్న అతడి సోదరి



బర్కత్‌పురలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి రాఖీ కడుతున్న కార్పొరేటర్ ఉమారాణి



సోదరుడికి రాఖీ కడుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



కార్పొరేటర్ అమృతకు రాఖీ శుభాకాంక్షలు తెలుపుతూ..



కొండ దేవయ్యకు రాఖీ కడుతున్న యువతి

## డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం



పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్

చిక్కడపల్లి: అభివృద్ధికి అడ్డంకిగా మారిన వాటర్ వర్క్స్ నూతన పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. అరుంధతినగర్‌లో నూతన వాటర్‌వర్క్స్ పైప్‌లైన్ పనులను శనివారం ఆమె వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, లైన్ సూపర్‌వైజర్ శంకర్‌తో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇటీవల నూతన పైప్‌లైన్ పనులకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు అడ్డుపడటంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు అడ్డంకులు తొలగాయని అన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయ పరిచి పనులు జరిపిస్తున్నామని పేర్కొన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్, బస్తీవాసుల ధనరాజ్, దేవేందర్, రామచందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు గిరిజనులు ఐక్యంగా పోరాడాలి



ట్యాంక్‌బండ్‌పై కొమురంభీం విగ్రహం వద్ద ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గిరిజన ఐక్య వేదిక నాయకులు

కవాడిగూడ: ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం స్ఫూర్తితో హక్కులను కాపాడుకునేందుకు గిరిజన తెగలు ఐక్యంగా పోరాడాలని గిరిజన ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు వివేక్ వినాయక్ పిలుపునిచ్చారు. శనివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు ప్రదర్శించిన గిరిజన వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజన ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు హెచ్‌కే నాగు, జాతీయ అధ్యక్షుడు వివేక్ వినాయక్, గౌరవ సలహాదారు జంగేశ్వర్ హాజరై మాట్లాడారు. ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి 'ఆదివాసీ బంధు'అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొమురంభీంకు భారత రత్న అవార్డును కేంద్రం ప్రకటించాలన్నారు. గిరిజన సాధికారత 2010ని తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీ కమిషన్‌ను ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి తక్షణమే వేరు చేసి ఎస్టీలకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఐటీడీఏ కాన్సెప్ట్‌ను తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి సోయం ప్రభాకర్, ట్రెజరర్ సోయం గోవర్ధన్, జాయింట్ సెక్రటరీ యాదగిరి, కొమురం నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నేర్పించాలి

చిక్కడపల్లి: కళల ద్వారా ఉన్నతమైన సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య, సంగీత కళా నిలయాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సాయిశరణ్య, సాయిశ్రావ్య అన్నారు. త్యాగరాయ గానసభలో శనివారం కళా నిలయం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా నటరాజ స్వామికి పూజ చేసి జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళలకు కాణాచి అయిన ప్రకాశం జిల్లా ఒంగోలు వేదికగా తమ కళా సంస్థను ఏర్పాటు శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నృత్యాన్ని పరిచయం చేస్తున్నామని అన్నారు. ఈ కళలను చిన్నతనం నుంచి నేర్పిస్తే వారు క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారని అన్నారు. వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు నంగీతం, నృత్యం తోడ్పడుతాయని తెలిపారు.

◆ ప్రకాశం జిల్లాకు చెందిన సినీ మాటల రచయితగా మరుధూరిరాజా, సంగీత దర్శకులుగా సాయి కార్తీక్ ప్రవేశించి ఉన్నతస్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. తమ కళా నిలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వారిని సత్కరించుకోవడం అభినందనీయమని అన్నారు. అదే విధంగా నాటక రంగ గురువులు చిట్టా శివప్రసాద్, కూచిపూడి నృత్య గురువులు ఎస్వీ శివకుమారిలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 50మంది కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత విభావరి ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, కళాకారులు జస్వత్, సుమంత్, కరవది నాగలక్ష్మి పాల్గొన్నారు.



కళా నిలయం వార్షికోత్సవానికి హాజరైన కళాకారులు, గురువులు చిట్టా శివప్రసాద్, ఎస్వీ శివకుమారి, నిర్వాహకులు సాయిశరణ్య, సాయిశ్రావ్య

## ఫీవర్ చౌరస్తాలో వెలగని హైమాస్ట్ లైట్లు



నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కొన్ని రోజులుగా వెలగడం లేదు. అక్కడ కొద్ది పాటి వీధి లైట్ల వెలుగు మాత్రమే ఉంటుంది. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాహనాల నుంచి వచ్చే హై ఫోకస్ హెడ్ లైట్ వెలుతురులో రోడ్డు సరిగా కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేయాలని విన్నవించినా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

## నేడు సభ్యత్వ నమోదు

కాచిగూడ: తెలంగాణ మున్నూరుకాపు సంఘం (పటేల్స్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్ పటేల్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండా దేవయ్యపటేల్, జల్‌పల్లి వెంకటేశ్వర్లు పటేల్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. మున్నూరుకాపులు అధిక సంఖ్యలో పాల్గొని సంఘం సభ్యత్వం తీసుకోవాలని కోరారు.


## బీసీ రిజర్వేషన్లపై డైవర్షన్ రాజకీయాలు

కాచిగూడ: బీసీ రిజర్వేషన్ల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే తమిళనాడు మాజీ సీఎం జయలలిత తరహాలో ఢిల్లీలో అమరణ దీక్ష చేసేవారని అన్నారు. శనివారం కాచిగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి నామ్‌కే వాస్తేగా ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. మళ్లీ బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు సాధించే వరకు సీఎం ఢిల్లీలోనే ఉండి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, కిరణ్, అర్జున్, వరుణ్, గోపి, వినయ్, వేదా అర్జున్, తేజస్, విప్లవ్, రుద్రాన్ష, దేవాన్ష, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

## ట్యాంక్‌ఫుల్‌బండ్



హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా అధికారులు ముందస్తుగా తూమును తెరిచి వరదనీటిని దిగువకు పంపిస్తున్నారు. ఒక తూము వద్ద ఏర్పాటు చేసిన గేట్‌ను అధికారులు పైకెత్తారు వరదనీరు పెరుగుతున్న క్రమంలో మిగత తూముల నుంచి వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. – కవాడిగూడ



## పూజ్యాయ.. రాఘవేంద్రాయ

• నేటి నుంచి శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు • ముస్తాబైన రాఘవేంద్రస్వామి మఠాలు



ఆరాధనోత్సవాలకు ముస్తాబైన బర్కత్‌పురలోని మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామి మఠం

కాచిగూడ: 'పూజ్యాయ రాఘవేంద్రాయ.. సత్య ధర్మ వ్రతాయచ.. భజతాం కల్పవృక్షాయ.. నమతాం కామధేనవే..' మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి 354వ ఆరాధనోత్సవాలు ఈనెల 10 నుంచి ప్రారంభకానున్నాయి. ఈ నేపథ్యంలో బర్కత్‌పురలోని రాఘవేంద్రస్వామి మఠం, లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితి మఠాలు ముస్తాబయ్యాయి. ఈనెల 10న పూర్వారాధన, 11న మధ్యారాధన, 12న ఉత్తరరాధన ఉంటుంది. ఉత్తరరాధనను పురస్కరించుకొని నిర్వహించే మహారథోత్సవానికి రెండు మఠాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాఘవేంద్రస్వామి మఠాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మఠం మేనేజర్ అమరచింత అనిల్‌కుమార్ తెలిపారు.

**భక్తిశ్రద్ధలతో ఉపకర్మ వేడుకలు**

◆ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని బర్కత్‌పురలోని రాఘవేంద్రస్వామి మఠం, లింగంపల్లిలోని బృందావన సమితిలో ఉపకర్మ వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా యజుర్వేద, రుగ్వేద నిత్య ఉపకర్మ శ్రావణసుధ పూర్ణిమ వేడుకలను నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతం, హస్తోదక మహా మంగళ హారతి, ధ్వజారోహణం, గోపూజ, ధాన్యపూజ, లక్ష్మీపూజలు చేశారు. అదేవిధంగా స్వామివారి రథోత్సవం, స్వస్తి వచనం, మహామంగళ హారతి పూజలు జరిగాయి.

**నేటి నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ**

◆ శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని 10, 11, 12వ తేదీల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

**12న విశేష రజత రథోత్సవం**

◆ రాఘవేంద్రస్వామి విశేష రజత రథోత్సవం 12న ఉంటుందని కాచిగూడ లింగంపల్లిలోని రాఘవేంద్ర స్వామి బృందావన సమితి మేనేజర్ నరసింహాచార్ కందుర్లూర్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5గంటలకు సుప్రభాతం, 6గంటలకు అష్టోత్తరం, 8.30గంటలకు పంచామృత మహా అభిషేకం, 10గంటలకు అలంకార హస్తోదకం, మధ్యాహ్నం 3గంటలకు శ్రీహరి కథామృతసార పారాయణం, సాయంత్రం 6.30గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8గంటలకు ఫల మంత్రాక్షిత తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.



మఠంలో కొలువుదీరిన శ్రీరాఘవేంద్రస్వామి



ముస్తాబైన లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితి ఆలయం